నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, శుక్రవారం 12 జూలై 2024 | YADADRI BHUVANAGIRI


## 'మహాలక్ష్మి'లో సమస్యలుంటే అధికారులకు ఫిర్యాదు చేయాలి

- జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి

యాదాద్రి భువనగిరి, జూలై 11 (నమస్తే తెలంగాణ) : మహాలక్ష్మి పథకంలో భాగంగా జిల్లాలో 2,21,476 మంది ఎల్‌పీజీ లబ్ధిదారులకు గానూ 1,13,232 మందిని అర్హులుగా గుర్తించామని జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. దీనిలో భాగంగా ఇప్పటి వరకు 1,88,949 సిలిండర్లను అందజేశామని, రూ. 5.90 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామని తెలిపారు. గురువారం నమస్తే తెలంగాణ దినపత్రికలో 'గ్యాస్ సబ్సిడీ గాయబ్' అనే శీర్షిక పేరుతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. తమ విచారణలో మేకల మంజుల, బోలెగాని నాగమణి సబ్సిడీకి అర్హులేనని వివరణ ఇచ్చారు. మిగతా ఇద్దరు లోడి రోహిణి, మాలోత్ అంబాలి సమాచారం లింక్ కాలేదని, తిరిగి మళ్లీ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పథకానికి సంబంధించి సందేహాలు ఉంటే ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో సంప్రదించాలని తెలిపారు.

## సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తులు

భువనగిరి కలెక్టరేట్, జూలై 11 : విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదువాలనుకునే మైనారిటీ విద్యార్థులు సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని యాదాద్రి భువనగిరి మైనారిటీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి పి. యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశీ విశ్వ విద్యాలయాల్లో పీజీ, పీహెచ్‌డీ విద్యనభ్యసించే మైనారిటీ(ముస్లిం, క్రిస్టియన్) విద్యార్థులు జనవరి 1 నుంచి ఈ నెల 31 ఆయా విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం తీసుకొని ఉండి కుటుంబ ఆదాయం రూ.ఐదు లక్షలలోపు ఉన్న వారు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ఎంపికైన విద్యార్థులకు రూ.20 లక్షల రూపాయల ఉపకార వేతనంతోపాటు విమానం ప్రయాణం ఖర్చులకు రూ.60 వేలు అందించనున్నట్లు తెలిపారు.

www.telanganaepass.cgg.gov.in ద్వారా ఆగస్టు 7వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయం, రూమ్ నంబర్ F-16, మొదటి అంతస్తు, కలెక్టర్ కార్యాలయంలోగానీ, 9505640004 ఫోన్ నంబర్‌లో గానీ సంప్రదించాలని పేర్కొన్నారు.

# సర్వర్ డౌన్

## రిజిస్ట్రేషన్లు బంద్

- సాంకేతిక సమస్యతో నిలిచిన సేవలు
- సబ్ రిజిస్ట్రార్, తాసీల్దార్ ఆఫీసుల్లో ఇబ్బందులు
- ముందస్తు సమాచారం ఇవ్వని అధికారులు
- రోజంతా ఆఫీసుల ఎదుట పడిగాపులు
- కనీసం వసతులు లేక అవస్థలు
- తీవ్ర ఇబ్బందులు పడిన క్రయవిక్రయదారులు
- జిల్లాలో 300వరకు ఆగిన వివిధ రకాల రిజిస్ట్రేషన్లు



గురువారం సాయంత్రం 4.40 గంటలకు భువనగిరి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ఎదుట పడిగాపులు గాస్తున్న క్రయవిక్రయదారులు

*సాంకేతిక సమస్యతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సర్వర్ డౌన్ కావడంతో క్రయవిక్రయదారుల లావాదేవీలు బంద్ అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. అధికారులు కనీసం ముందస్తు సమాచారం కూడా ఇవ్వలేదు. దీంతో క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్రయవిక్రయదారులు రోజంతా కార్యాలయాల ఎదుట పడిగాపులు కాశారు. అన్ని రకాల లావాదేవీలు కలిపి సుమారు 300వరకు రిజిస్ట్రేషన్లు ఆగిపోయినట్లు అధికారులు చెబుతున్నారు.*

*– యాదాద్రి భువనగిరి, జూలై 11 (నమస్తే తెలంగాణ)*

జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ పోర్టల్ సర్వర్‌లో సాంకేతిక సమస్య ఏర్పడింది. ఉదయం నుంచే టెక్నికల్ ప్రాబ్లమ్‌తో రిజిస్ట్రేషన్ల సేవలు నిలిచిపోయాయి. ఈ-కేవైసీ సమస్య ఉందని అధికారులు చెప్పారు. దాంతో క్రయవిక్రయదారులకు నిరాశే ఎదురైంది. ఇండ్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం వచ్చినోళ్లు ఉదయం నుంచి కార్యాలయాల వద్ద పడిగాపులు గాశారు. అనేక మంది మధ్యాహ్నం భోజనం కూడా చేయకుండా అక్కడే ఉండిపోయారు. వృద్ధులు, మహిళలు సాయంత్రం వరకు నిరీక్షించారు. సర్వర్ సాంకేతిక సమస్య తీరిపోతుందేమోనని చాలా మంది సాయంత్రం 5గంటల వరకు ఎదురుచూశారు. కానీ ఎంతకీ సమస్య తొలగిపోకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. అయితే రిజిస్ట్రేషన్ కాకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దూర ప్రాంతాల నుంచి సెలవులు తీసుకొని వచ్చామని, మళ్లీ ఇంకో రోజు సెలవు పెట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సర్వర్‌లో సమస్య వచ్చిందని, తామేం చేయలేమని అధికారులు చేతులెత్తేశారు. మరోవైపు క్రయవిక్రయదారులకు కనీస సదుపాయాలు కూడా లేకపోవడంతో అవస్థలు పడ్డారు.

### సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఇలా..

జిల్లా వ్యాప్తంగా ఆరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు ఉన్నాయి. భువనగిరి, యాదగిరిగుట్ట, మోత్కూరు, రామన్నపేట, చౌటుప్పల్, బీబీనగర్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. అన్నింటిలోనూ ప్లాట్లు, ఇండ్ల రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. నిత్యం ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సగటున 40 నుంచి 50 రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. గురువారం సర్వర్ డౌన్‌తో భువనగిరిలో 45, చౌటుప్పల్‌లో 40, బీబీనగర్‌లో 26, యాదగిరిగుట్టలో 20, రామన్నపేటలో 12, మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 10 రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.

### తాసీల్దార్ కార్యాలయాల్లోనూ..

వ్యవసాయ భూములకు సంబంధించి తాసీల్దార్ కార్యాలయాల్లోనూ రిజిస్ట్రేషన్ సేవలు ఆగిపోయాయి. జిల్లాలో 17 మండలాలు ఉండగా, అన్ని చోట్లా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌తోపాటు ఇతర సేవలు కొనసాగుతాయి. అయితే ధరణిలో రిజిస్ట్రేషన్ కోసం ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. క్రయవిక్రయదారులు వెసులుబాటు చూసుకుని స్లాట్ బుక్ చేసుకుంటున్నారు. కానీ సర్వర్ డౌన్‌తో తీవ్ర ఇబ్బందులు తప్పలేదు. అయితే ధరణిలో స్లాట్ బుక్ చేసుకున్నోళ్లకు శుక్రవారం రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. చౌటుప్పల్‌లో 14, వలిగొండలో 18, రాజాపేటలో 11, భువనగిరిలో 12, ఆలేరు తాసీల్దార్ కార్యాలయంలో 16 రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.

### సాయంత్రం దాకా ఎదురుచూసినం..



నేను హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాను. యాదగిరిగుట్ట దగ్గరలో ప్లాట్ కొనుగోలు చేశాను. రిజిస్ట్రేషన్ కోసం ఉదయమే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వచ్చాను. కానీ సర్వర్ బిజీగా ఉందని అధికారులు చెప్పడంతో నిరాశ చెందాం. సాయంత్రం వరకైనా సమస్య పరిష్కారం అవుతుందేమోనని ఆఫీసు ఎదుటే ఎదురుచూశాం. సాయంత్రం 5గంటల వరకు కూడా సాంకేతిక సమస్య సమసిపోలేదు. మళ్లీ సమయం చూసుకొని సెలవు పెట్టి రిజిస్ట్రేషన్ కోసం రావాలి.

*– కేవీ, మురళీధర్, హైదరాబాద్*



గుండాల మండలం వెల్మజాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

## రాష్ట్రంలో పోలీస్ రాజ్యం

- విద్యార్థులు, నిరుద్యోగులపై నిర్బంధాలు
- జర్నలిస్టులపై దాడులు హేయమైనచర్య
- మాజీ ఎమ్మెల్యే గొంగిడి

గుండాల, జూలై 11 : తెలంగాణ రాష్ట్రంలో పోలీసులు రాజ్యం నడుస్తున్నదని, నాడు ఇందిరమ్మ రాజ్యంలో దేశ ప్రజలను ఎమర్జెన్సీ పేరుతో భయపెట్టినట్లుగానే నేడు సీఎం రేవంత్‌రెడ్డి కూడా అలాంటి పరిస్థితులే తీసుకువస్తున్నాడని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి విమర్శించారు. గుండాల మండలంలోని వెల్మజాల గ్రామంలో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నదని, రాష్ట్రంలో పోలీసుల చర్యలు మితిమీరుతున్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా తమ డిమాండ్లను అడిగే హక్కు ప్రజలకు ఉంటుందని, ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని విద్యార్థులు, నిరుద్యోగులు అడిగితే పోలీసులతో దాడులు చేసి అరెస్టులు చేయించడం దారుణమని తెలిపారు. నిరుద్యోగులు కోరుకున్న విధంగా డీఎస్సీ గడువు పొడిగించాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో కవరేజ్‌కి వెళ్లిన జర్నలిస్టులపై పోలీసులు దాడులు చేయడం అప్రజాస్వామికమని అన్నారు. ప్రభుత్వాలు, ప్రజలకు మధ్య వారధిగా ఉండే జర్నలిస్టులపై దాడులు చేసే సంస్కృతి మంచిది కాదని, తక్షణమే ప్రభుత్వం జర్నలిస్టులకు క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఎండీ ఖలీల్, నాయకులు కోలు కొండ రాములు, బాలమల్లు, నాగరాజు, ఎల్లయ్య, పరశురాములు, శ్రీశైలం, బాలనర్సయ్య, అయిలయ్య పాల్గొన్నారు.

## ఓజో పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

- తప్పిన ప్రాణాపాయం.. రూ.30 కోట్ల ఆస్తి నష్టం



చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామ పరిధిలోని ఓజో అగ్రి ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో కాలిపోయిన రియాక్టర్

చౌటుప్పల్‌రూరల్, జూలై 11: చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారం రెవెన్యూ పరిధిలోని ఎల్లంబావి గ్రామ శివారులో గల ఓజో అగ్రి ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో బుధవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాత్రి 1:40 గంటలకు రియాక్టర్ 1లో ప్రమాదం సంభవించడంతో కార్మికుడు గుర్తించి కేకలు వేయగా తోటి కార్మికులు అప్రమత్తమై పరిశ్రమ బయటికి పరిగెత్తారు. మరి కొద్ది సమయానికి రెండో రియాక్టర్ సైతం మంటలు వ్యాపించడంతో పిల్లంగ్ మిషన్స్, ముడి రసాయనాలు, ప్యాకింగ్ మిషన్స్ తదితర పరిశ్రమకు సంబంధించినవి భారీ స్థాయిలో కాలిపోయాయి.

సుమారు రూ.30 కోట్ల నష్టం వాటిల్లినట్లు పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ రవికుమార్ ఫిర్యాదులో తెలిపారు. పరిశ్రమ కొనసాగుతున్న సమయంలోనే పేలడం, కార్మికులు అప్రమత్తమై బయటకు పరుగెత్తడంతో ప్రాణ నష్టం జరుగలేదు. ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

## కలవర పెడుతున్న వరుస అగ్ని కీలలు

- చౌటుప్పల్ పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు
- జాగ్రత్తలు పాటించక పోవడంతోనే సంఘటనలు
- కార్మికులకు కూడా రక్షణ కరువు
- ప్రమాదాలు జరిగినప్పుడే అధికారుల హడావుడి

చౌటుప్పల్ : చౌటుప్పల్‌లో వరుస అగ్ని ప్రమాదాలు కలవరపెడుతున్నాయి. పరిశ్రమల యాజమాన్యాలు సరైన జాగ్రత్తలు పాటించకపోవడంతోనే తరుచూ ఎక్కడో ఓ చోట ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వేసవిలో ఈ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఫలితంగా అధిక శాతం నష్టాలు కావడంతోపాటు సమీప ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పరిశ్రమలో కార్మికులు సైతం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పనిచేయాల్సి వస్తున్నది. ముందుస్తుగా అగ్ని ప్రమాదాలపై పరిశ్రమ నిర్వాహకులు అవగాహన కల్పించకపోవడం కూడా లోపంగా కనిపిస్తున్నది. కార్మికులకు వీటిపై సరైన శిక్షణ లేకపోవడంతో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తున్నది. దీనికి అడ్డుకట్ట వేయాలంటే సిబ్బందికి ప్రత్యేక శిక్షణతోపాటు ప్రమాదాలపై అవగాహన కల్పించే వ్యవస్థ పరిశ్రమల్లో ఉండాలి. చాలా చోట్ల ఆ పరిస్థితి లేకపోవడం ప్రమాదాలకు కారణం అవుతున్నట్లు పలువురు భావిస్తున్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు సంబంధిత అధికారులు హడావుడి చేయడం, తర్వాత వదిలివేయడం కూడా మరో కారణంగా చెప్పవచ్చు. ఇప్పటికైనా సేఫ్టీ లేని పరిశ్రమలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### ఈ ఏడాది ప్రమాదాలు ఇలా...

ఈ ఏడాది ఏప్రిల్ 19న చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ఓం సాయి ప్లాస్టిక్ గోదాములో అకస్మాత్తుగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. గంటల తరబడి ఫైర్ ఇంజిన్లు, వాటర్ ట్యాంకర్లు రప్పించి మంటలు ఆర్పించారు. అయినా ఫలితం లేకుండా పూర్తిగా కాలిపోయాయి. తాజాగా గురువారం చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామ పరిధిలోని ఓజో విత్తనాల ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ రెండింట్లో ఆస్తి నష్టం తప్పితే ప్రాణ నష్టం జరుగపోవడంతో కార్మికులు ఊపిరిపిల్చుకున్నారు. దీనికితోడు ఈ పరిశ్రమల సమీపంలో మరిన్ని రసాయన పరిశ్రమలు ఉండటంతో మంటలు బయటకు వ్యాపించి వాటిని చుట్టుముడితే భారీగా నష్టం చేకూరే ప్రమాదం ఉన్నది. ఇలాంటి సంఘటనలు గతంలో అనేకం ఉన్నాయి. కొన్ని ప్రమాదాల్లో కార్మికులు సైతం గాయపడిన సంఘటనలు ఉన్నాయి. కాగా జిల్లా వ్యాప్తంగా ఉన్న 13 పెస్టిసైడ్ పరిశ్రమల్లో రెండింటికి మాత్రమే సేఫ్టీ పర్మిషన్ ఉండటం గమనార్హం.

### ఫైర్ సేఫ్టీ అందుబాటులో ఉండాలి



అగ్ని ప్రమాదాల నివారణకు ముందుస్తు చర్యలు తీసుకోవాలి. ఫైర్ సేఫ్టీ ప్రతి పరిశ్రమలో అందుబాటులో ఉండాలి. వాటర్ ట్యాంక్ నిర్మించుకోవాలి. డ్రై క్లోరైడ్ పౌడర్‌తో పాటు సీఓటు ఏర్పాటు చేసుకోవాలి. కార్మికులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించాలి. వారికి ప్రతి రెండు నెలలకు శిక్షణ ఇవ్వాలి.

*– బి.శివాజీ, ఫైర్ ఆఫీసర్, చౌటుప్పల్*

## రైల్వేట్రాక్ పనులు వేగంగా పూర్తి చేయాలి

- యాదాద్రి పవర్ ప్లాంటును పరిశీలించిన జెన్‌కో సీఎండీ రొనాల్డ్‌రోస్
- పనుల పరిశీలన.. అధికారులతో సమీక్ష

దామరచర్ల, జూలై 11: యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటుకు అనుసంధానంగా ఏర్పాటు చేస్తున్న రైల్వేట్రాక్‌ల నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేయాలని టీఎస్ జెన్‌కో సీఎండీ రోనాల్డ్ రోజ్ అధికారులను ఆదేశించారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రెండు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తికి బొగ్గును సరఫరా చేసే రైల్వే లైన్ల పనులు ఇంకా పూర్తికాకపోవడంతో గురువారం ఆయన నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలోని జానపహాడ్ టేకాఫ్ పాయింట్ నుంచి ప్లాంటులోని కోల్‌మార్షలింగ్ యార్డు వరకు రైల్వే పనులను పరిశీలించారు. పనుల జాప్యానికి కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైల్వే సైడింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం ప్లాంటులోని టర్బయిన్లు, కంట్రోల్ రూమ్, యాష్‌ప్లాంట్, కోల్ స్టోరేజ్, రిజర్వాయర్, చిమ్నీలు, బాయిలర్లు, కూలింగ్ టవర్లను పరిశీలించారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రెండు యూనిట్లను సందర్శించారు. అనంతరం టీఎస్ జెన్‌కో, బీహెచ్‌ఈఎల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, ప్లాంటు పనుల పురోగతిని చర్చించారు. మొదటి రెండు యూనిట్లల్లో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు సీఎండీ తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్లు అజయ్, సచ్చితానందం, సీఈలు సమ్మయ్య, పీవీ శ్రీనివాస్, జీ శ్రీనివాస్, డీఈ హనుమాన్ పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

- హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
- నల్లగొండ, సూర్యాపేటలో విద్యార్థుల భారీ ర్యాలీ.. కలెక్టరేట్ ముట్టడి



నల్లగొండలో కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు



సూర్యాపేటలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థులు

రామగిరి, జూలై 11 : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు తక్షణమే నోట్‌బుక్స్ అందజేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా వందలాదిగా తరలివచ్చిన విద్యార్థులు కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ రూ. 8000 కోట్లు బకాయి ఉండటం వల్ల ప్రైవేట్ కళాశాలలో చదువుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద మధ్యతరగతి విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువులు మధ్యలో ఆగిపోకుండా ఉండాలంటే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందించాలని కోరారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా నల్లగొండ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు ఇప్పటివరకు పుస్తకాలు, యూనిఫాం, దుప్పట్లు ఇవ్వలేదన్నారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో విద్యార్థులకు విద్యార్థులకు నాసిరకం బియ్యంతో భోజనం పెడుతున్నారని తెలిఆపరు. అన్ని హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించే విధంగా అధికారులను పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని, గతంలో డీఈఓ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆకారపు నరేశ్, కుంచం కావ్య, సైదానాయక్, లక్ష్మణ్, ఖమ్మంపాటి శంకర్, బుడిగ వెంకటేశ్ పాల్గొన్నారు.

### సూర్యాపేటలో ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

బొడ్రాయిబజార్ : పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని సూర్యాపేట జిల్లా కేంద్రంలోనూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ తీశారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉపకార వేతనాలు, మెస్ కాస్మోటిక్ చార్జీలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఆందోళనలు చేసినప్పుడు టోకెన్‌లు జారీ చేయడం తప్ప ట్రెజరీలకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం విమర్శించారు. ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలు వీడి అసెంబ్లీ సమావేశాల నాటికి సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులతో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బానోతు వినోద్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు యాతాకుల ప్రవీణ్, వినయ్, రవి, గోపి, మధు, అరుణ్, అజయ్, భార్గవి, అరుణ, స్వప్న, గీతిక, స్పందన, సౌజన్య, గౌతమి పాల్గొన్నారు.



కేవీఎస్ రీజినల్ చెస్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

## కేంద్రీయ విద్యాలయంలో రీజినల్ చెస్ పోటీలు ప్రారంభం

రామగిరి, జూలై 11 : నల్లగొండ జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో కేవీఎస్ రీజినల్ లెవెల్ చెస్ టోర్నమెంట్ గురువారం ప్రారంభమైంది. హైదరాబాద్ రీజియన్ పరిధిలోని పాఠశాలల నుంచి అండర్ – 14, 17, 19కి చెందిన బాల, బాలికలు హాజరుకావడంతో అంతా సందడిగా కనిపించింది. పోటీలను నల్లగొండ కేవీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. శుక్రవారంతో ఈ పోటీలు ముగియనున్నాయి. ఇక్కడ ప్రతిభ చూపిన విద్యార్థులను కేవీ నేషనల్ స్థాయి పోటీలకు పంపిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె.కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట అర్బన్, జూలై 11 : హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించే సివిల్స్, ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు 10 నెలల ఉచిత శిక్షణకు గాను జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూర్యాపేట స్టడీ సర్కిల్ డైరెక్టర్ చిట్టిపాక రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత పరీక్ష నిర్వహించిన అనంతరం ఎంపిక ఉంటుందని తెలిపారు. TSSTUDY CIRCLE.CO.IN వెబ్ సైట్ ద్వారా ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 99891 29935 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

- ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



తిప్పర్తిలోని బాలుర ఉన్నత పాఠశాలలో మొక్కనాటి నీళ్లు పోస్తున్న మంత్రి కోమటిరెడ్డి, పక్కన కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ సిటీ, జూలై 11 : దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు వ్యక్తులు ముందుకు వచ్చినప్పుడు గ్రామాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ మండలంలోని సిలార్‌మియాగూడెంలో గురువారం తాజా మాజీ సర్పంచ్ యర్రమాద కవితానరేందర్‌రెడ్డి సహకారంతో దాత యర్రమాద మురళీధర్ రెడ్డి రూ. 25లక్షలతో నిర్మించిన గ్రంథాలయం, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన గ్రామం కోసం సొంత నిధులతో భవనం నిర్మించడం అభినందనీయమన్నారు. సిలార్‌మియా గూడేనికి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేస్తున్నామని, వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకొని మొక్కలను నాటాలని మంత్రి వెంకట్‌రెడ్డి కోరారు. వన మహోత్సవంలో భాగంగా తిప్పర్తి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కలెక్టర్ సి. నారాయణ రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. వన మహోత్సవంలో ఈ సంవత్సరం 66వేల మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తాగునీటి ట్యాంకును కోరగా వెంటనే మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూర్ణ చందర్, జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీఈఓ భిక్షపతి, ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ భూమన్న, ఆర్డీఓ రవి, మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, మాజీ ఎంపీపీ విజయలక్ష్మి, తాజా మాజీ సర్పంచ్ యర్రమాద కవితా నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.